బిక్కు బిక్కుమంటూ విధులు..!

ప్రమాదకరంగా తోట్లవల్లూరు వెలుగు కార్యాలయం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు వెలుగు కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. శిథిల భవనంలో కార్యాలయ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి దాపురించింది. మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామనే ప్రజాప్రతినిధుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. తోట్లవల్లూరు వెలుగు కార్యాలయానికి సొంత భవనం లేక కునారిల్లుతోంది. స్థానిక ఎస్సీ బాలుర వసతి


పెచ్చులూడుతున్న భవనం శ్లాబు

గృహంలో గత కొన్నేళ్ల క్రితం వెలుగు కార్యాలయం తాత్కాలికంగా ఏర్పాటైంది. కార్యాలయం ఉన్న భవనం శిథిల దశకు చేరి ప్రమాదకరంగా మారింది. చెదలు తినేస్తున్నా, శ్లాబు పెచ్చులూడిపోతున్నా కార్యాలయ సిబ్బంది దినదినగండం నూరేళ్ల ఆయుష్షులా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.

సొంత భవనం ఊసేది..?

మండల వ్యాప్తంగా 918 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. ఆయా గ్రూపుల్లో 9,253 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. డ్వాక్రా గ్రూపుల మీద పర్యవేక్షణకు 39 మంది వీఓలు ఉన్నారు. ముగ్గురు సీసీలు, ఒక అకౌంటెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నారు. బ్యాంకు రుణాల పనుల మీద డ్వాక్రా మహిళలు నిత్యం కార్యాలయానికి వస్తూనే ఉంటారు. ఇలాంటి కార్యాలయానికి సొంత భవనం లేకుండా పోయింది. నూతన భవన నిర్మాణం గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు మహిళల నుంచి వస్తున్నాయి.


తోట్లవల్లూరులో ప్రమాదకరంగా వెలుగు కార్యాలయం

భయాందోళనలో మహిళలు

వెలుగు కార్యాలయానికి రావాలంటే డ్వాక్రా మహిళలు భయపడే పరిస్థితి ఏర్పడింది. శిథిలావస్థకు చేరిన భవనంలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే ఆందోళన వారిలో నెలకొంది. కార్యాలయ సిబ్బందితోపాటు వివిధ గ్రామాల నుంచి పనులపై వచ్చే మహిళలకు కనీసం మరుగుదొడ్ల సదుపాయం కూడా లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి


భయంగా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

వెలుగు కార్యాలయానికి నూతన భవనం సమకూరేలా చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు, కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



మండలంలో డ్వాక్రా మహిళలందరికీ సంబంధించిన కార్యాలయానికి సొంత భవనం లేకపోవటం దురదృష్టకరం. ప్రమాదకర భవనంలో విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– పెనుమత్స రాధిక, సర్పంచ్, తోట్లవల్లూరు

ఇబ్బందిగా ఉంటోంది



వెలుగు కార్యాలయ భవనం శిథిల దశకు చేరిన మాట వాస్తవమే. చెదలు తినేస్తూ, శ్లాబు పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. ఇలాంటి భవనంలో విధులు నిర్వర్తించాలంటే ఇబ్బందిగా ఉంది. అద్దె భవనంలోకి మారే ఆలోచన చేస్తున్నాం.

– ఎం.సాంబశివరావు, వెలుగు ఏపీఎం, తోట్లవల్లూరు

క్లుప్తంగా

విద్యార్థినులకు ముగిసిన ఇంటర్న్‌షిప్



పమిడిముక్కల: తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని 10వ తరగతి విద్యార్థినులు 10 రోజుల వృత్తి విద్యా కోర్సుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం విజయవంతగా ముగిసింది. సమక్ష శిక్షా డీసీడీఓ సీతామహాలక్ష్మి, ఒకేషనల్ కోర్సు జిల్లా కో–ఆర్డినేటర్ సాయిరాం, హెచ్ఎం ప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. వృత్తి విద్య ప్రాధాన్యతను ఒకేషనల్ ట్రైనర్ ఈశ్వరి వివరించారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి



గుడివాడ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి సమస్య అధికంగా ఉంది. స్థానిక టీచర్స్ కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న డ్రెయిన్లలో సిల్టు తొలగించకపోవడంతో రెండు వైపులా డ్రెయినల్లలోని మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

10 ఎకరాల గడ్డి వాము దగ్ధం

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు గ్రామంలో ఉప్పాల వెంకటేశ్వరరావుకు చెందిన 10 ఎకరాల వరిగడ్డి వాము సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైంది. రూ.80 వేల ఆస్తినష్టం సంభవించింది. సమాచారం అందుకున్న మొవ్వ ఫైర్ ఆఫీసర్ కె వెంకటేశ్వరరావు సిబ్బంది సహకారంతో మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదానానికి గల కారణం తెలియరాలేదని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

రేపు ఆలయ భూములకు కౌలు వేలం

తోట్లవల్లూరు: దేవాలయ భూములకు ఈ నెల 17న కౌలు వేలం నిర్వహించనున్నట్లు తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి హరి దుర్గా నాగేశ్వరరావు తెలిపారు. పెనమకూరులోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయానికి చెందిన 14.85 ఎకరాలకు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు, చాగంటిపాడులోని చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 6.65 ఎకరాలకు మధ్యాహ్నం రెండు గంటలకు కౌలు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చాగంటిపాడులోని సోమేశ్వరస్వామి ఆలయానికి చెందిన 8.95 ఎకరాలకు మధ్యాహ్నం మూడు గంటలకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల కాల పరిమితితో జరిగే వేలంలో ఆసక్తి కలిగిన రైతులు దరావత్తు చెల్లించి పాల్గొనాలని ఈఓ పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా మనోహర్



గుడివాడ టౌన్: గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.మనోహర్ నియమితులయ్యారు. కాకినాడ కార్పొరేషన్ డెప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్ బదిలీపై గుడివాడకు వచ్చారు. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న బి. శ్రీనివాసరావు గుంటూరు కార్పొరేషన్ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ కళాశాల్లో విజయోత్సవ సంబరాలు



మొవ్వ: స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు విజయోత్సవ సంబరాలను మంగళవారం నిర్వహించుకున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కృష్ణా జిల్లాలోని ప్రభుత్వం కళాశాలల్లో ప్రథమ స్థానంలో నిలిపిన విద్యార్థులను, వారికి సహకరించిన తల్లిదండ్రులను అధ్యాపకులు అభినందించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సుధాకర్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి తమ కళాశాల విద్యార్థులు ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేస్తూ హ్యాట్రిక్ సాధించటం గర్వకారణమన్నారు. అనంతరం కళాశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు.

కొల్లేరు చిక్కుముడిని విప్పతాం

కైకలూరు: కొల్లేరులో చిక్కు పెద్దగా పెరిగింది.. ఒక్కో ముడిని జాగ్రత్తగా విప్పుతామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ పేపేర్కొన్నారు. కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్లో టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ సుప్రీం కోర్టులో కొల్లేరు అంశంపై అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సమస్య పరిష్కారానికి సమయం చెప్పలేకపోయినా కొల్లేరు అంశంపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కైకలూరు పట్టణ అధ్యక్షుడు ఎండీ.జానీ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరు పాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. సదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

లోకమూడిలో ఫిజియోథెరపీ

మండవల్లి: మండలంలోని లోకుమూడి భవిత స్పెషల్ స్కూల్లో ప్రత్యేక అవసరాలు గల తొమ్మిది మంది పిల్లలకు మంగళవారం ఫిజియోథెరపిస్ట్ సునీత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాంపులో మాదిరిగా ఇంటివద్ద పిల్లలతో ఆసనాలు చేయించాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఐఈఆర్‌టీలు టి అరుణకుమారి, పి వసంత, శైలజ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు: విద్యుత్ సరఫరాలో బుధవారం వరకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ వరకుమార్ మంగళవారం తెలిపారు. 132 కేవీ చిగురుకోట లైను(టవర్ లైన్స్)లో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆ సమస్యను బుధవారం సరి చేయనున్నట్లు తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు భూమిపూజ

పామర్రు: నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ త్వరలో తీరబోతోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక పీహెచ్‌సీని 30 పడకల సీహెచ్‌సీగా మార్పుదల చేసి కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) భవన నిర్మాణ సముదాయానికి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు ఈ సీహెచ్‌సీ వలన ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మెరుగైన వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే అందుబాటులోకి వస్తాయన్నారు. నిష్ణాతులైన 13 విభాగాలకు చెందిన వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. 30 పడకల వైద్యశాల ఏర్పాటుకు సుమారు రూ.6 కోట్లతో పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మండల పార్టీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వైద్యశాల సూపరింటిండెంట్ పాల్గొన్నారు.


సీహెచ్‌సీ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పౌష్టికాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం


గరికపర్రులో అవగాహన కల్పిస్తున్న నాగమల్లేశ్వరి


దేశన్నపాలెంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఝాన్సీరాణి

తోట్లవల్లూరు: పౌష్టికాహారంతోనే పిల్లలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కే నాగమల్లేశ్వరి సూచించారు. మండలంలోని గరికపర్రు–3 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: గర్భధారణ మొదలు పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు పిల్లల జీవితంలో అత్యంత ముఖ్యమైన సమయమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.ఝాన్సీరాణి అన్నారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దేశన్నపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వెయ్యి రోజుల సంరక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో పోషణ పక్వాడ్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణ అవసరం

గుడివాడ టౌన్: విద్యార్థుల్లో పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించాలంటే ప్రయోగాత్మక శిక్షణ ఎంతో అవసరమని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ అన్నారు. మంగళవారం కళాశాల విద్యార్థులు కైకలూరు నియోజకవర్గం పెరికీడులోని పెన్నార్ సిరామిక్స్ లిమిటెడ్ కంపెనీని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రయోగాత్మకంగా ప్రత్యక్ష పరిజ్ఞానం విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందన్నారు. ప్రత్యేకించి ఎంబీఏ విద్యార్థులకు ఈ పారిశ్రామిక సందర్శనలు అవసరమన్నారు. కార్యక్రమంలో కంపెనీ సీనియర్ మేనేజర్ వి. శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పారిశ్రామిక సందర్శన చేస్తున్న ఏఎన్నార్ విద్యార్థులు

టీడీపీ నేతపై క్రమశిక్షణ చర్యలకు డిమాండ్

పెదపారుపూడి: పెదపారుపూడి నుంచి బేతవోలువరకు పొలిమెర డొంకను గ్రామ సర్పంచ్ భర్త టీడీపీ నేత అక్రమంగా మట్టి తవ్వకం చేయటంతో రైతులతో కలిసి వెళ్లి నిలుపుదల చేసినందకు తనపై దాడి చేసి గాయపరిచిన చప్పిడి కిషోర్ అగడాలను అరికట్టి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మరో టీడీపీ నేత బెనర్జీ కోరారు. పెదపారుపూడిలో మంగళవారం బెనర్జీ, రైతులు, టీడీపీ నేతలు కలిసి విలేకరులతో మాట్లాడారు. పొరంబోకు డొంక రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. గత శనివారం డొంకను తవ్వి మట్టి అమ్ముకునేందుకు పొక్లెయిన్, ట్రాక్టర్లు పెట్టి సిద్ధంగా ఉన్నాయని తెలపటంతో రైతులతో కలిసి వెళ్లి అడ్డుకున్నామన్నారు. దీంతో చప్పిడి తనను అసభ్యంగా మాట్లాడారని బెనర్జీ తెలిపారు. అనంతరం శనివారం రాత్రి పంచాయతీ సెంటర్‌లో తనపై చప్పిడి కిషోర్, అతని తమ్ముడు మాణిక్యాలరావు, మరో వ్యక్తి వచ్చి రాడ్డులతో దాడి చేసి గాయపరిచారని తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వర్ల కుమారరాజాకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు.


తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ ధనలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న రైతులు, బెనర్జీ

తహసీల్దార్ కార్యాలయంలో వినతిప్రతం

పెదపారుపూడి నుంచి వెళ్లే పొలిమెర డొంక అక్రమ మట్టి తవ్వకాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని రైతులు టీడీపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయ డీటీ ధనలక్ష్మికి వినతిపత్రం అందించారు. పుణుకొల్లు భానుకుమార్, గారపాటి నాగబాబురావు, మసిముక్కు ఆంజనేయులు, రాఘవ, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: వ్యక్తి అదృశ్యంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని కోమర్రులో గ్రామానికి చెందిన కేఎస్‌పీ ఫణీంద్ర వడాలి పెట్రోల్ బంకులో పనిచేస్తుంటాడు. ఫణీంద్రకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ నెల 13న పెదపాలపర్రుకు ఫంక్షన్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వీరభద్రరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల పాట్లు




ముదినేపల్లి రూరల్: వేసవిలో మండే ఎండల్లో ఇంటింటికీ తిరిగి బడికి రాని, బడి మానేసిన పిల్లలను పాఠశాలకు రప్పించే పనిలో ఉపాధ్యాయులు పడ్డారు. మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం పెయ్యేరు కాలనీలో ఇంటింటికీ తిరిగి జల్లెడపట్టి బడి మానేసిన, బడికి రాని విద్యార్థులను గుర్తించేందుకు శ్రమించారు. ఎట్టకేలకు 13 మంది బాలలను గుర్తించారు. వారి తల్లిదండ్రులతో సామరస్యంగా మాట్లాడి పాఠశాలకు పంపేలా ఒప్పించి, వివిధ తరగతుల్లోకి ప్రవేశాలు కల్పించారు. ఈ విద్యాసంవత్సరం మరికొద్ది రోజుల్లో ముగుస్తున్నందున వచ్చే విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

వీరాంజనేయ స్వామికి విశేష పూజలు



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు, విశేషంగా పూజాకార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పాల పొంగళ్లను స్వయంగా వండి స్వామికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహన కొనుగోలుదారులు తమ వాహనాలకు విశేష పూజలను చేయించుకున్నారు. ఆలయంలో పూజలను అర్చకులు దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించామని ఈఓ ప్రసాదరావు పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ



పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురం అడ్డరోడ్డు వద్ద మంగళవారం పైడిముక్కల శ్రావణ సంధ్య జయంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. శేఖర్, రవీంద్ర, నాగరాజు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారులు నమోదు కావాలి

పామర్రు: పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారులు తమకు తామే నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించామని ఐసీడీఎస్ పామర్రు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.సత్యవతి పేర్కొన్నారు. స్థానిక కూర్మాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తమ ఆరోగ్య పరిరక్షణకు 1,000 రోజుల కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించామన్నారు. దీని ద్వారా ఆరోగ్యకరమైన బిడ్డకు, ఊబకాయంతో జన్మించిన బిడ్డకు మధ్య ఉన్న తేడాను వివరించామన్నారు. ఏఎన్ఎం రోహిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదమద్దాలిలో..

గ్రామ సచివాలయ పరిధిలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలకు కలిపి పోషణ పక్వాడా కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీఎంఏఎం కార్యక్రమం ద్వారా చిన్నారులలో ఊబకాయాన్ని తగ్గించటానికి ఆరోగ్యకరమైన జీవన శైలి అంశాలపై అవగాహన కల్గించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పామర్రులో లబ్ధిదారులతో సూపర్‌వైజర్ సత్యవతి

అభివృద్ధికి మహిళలు ముందుకు రావటం అభినందనీయం

గుడ్లవల్లేరు: సింగలూరు అభివృద్ధిలో తాము సైతం ఉన్నామంటూ మహిళలు ముందుకు రావటం అభినందనీయమని ఎంపీడీఓ టి.విజయసారథి అన్నారు. తమ గ్రామమంతా పరిశుభ్రంగా ఉండాలని కాంక్షిస్తూ గ్రామ పంచాయతీ వారికి భాగ్య విదాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగలూరులో విస్తరాకుల కుటీర పరిశ్రమలోని మహిళలు మంగళవారం తడి, పొడి చెత్త సేకరణకు రిక్షా, డస్ట్‌బిన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగ్య విదాత ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, వైస్ చైర్మన్ బండారు సరస్వతి దంపతులు, మండల పరిషత్ ఏఓ ఇమ్రాన్, గ్రామ కార్యదర్శులు జె.నరసింహారావు, ఎలీషారావు, చాపరాల రాజేష్, సర్పంచ్ అర్జునరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసరరావు పాల్గొన్నారు.


చెత్త సేకరణకు డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ విజయసారథి

అగ్ని ప్రమాదాల అప్రమత్తతపై అవగాహన


మొవ్వ జేజే నగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది


గుడివాడలో డెమో నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

మొవ్వ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం కూచిపూడి, మొవ్వ బస్ స్టేషన్‌లో, మొవ్వ జెజేనగర్‌లో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల అప్రమత్తతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాధారణ జాగ్రత్తలు, వంట ఇంట్లో జాగ్రత్తలు తదితర అంశాలపై సూచన లు ఇచ్చారు. ఈ సందర్భంగా గ్యాస్ లీకై మంటలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలను డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో మండల అగ్నిమాపకాధికారి కొణతం వెంకటేశ్వరరావు, లీడింగ్ ఫైర్ మెన్స్ వెంగళరావు, పూర్ణచంద్రరావు, డ్రైవర్, ఆపరేటర్లు కె.శ్రీనివాసరావు, జి.శ్రీను పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని కై కలూరు అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వాస్పత్రిల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు.


కైకలూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఫైర్ సిబ్బంది

గుడివాడలో..

గుడివాడ టౌన్: అగ్నిప్రమాదాల అప్రమత్తతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరగడానికి కారణాలు, వాటి నివారణపై ప్రయోగాత్మకంగా ప్రయాణికులకు వివరించారు.



గుర్రపుడెక్క ఇలా..

కాలువలో నీరు పారేది ఎలా?

తోట్లవల్లూరు–ఉయ్యూరు ప్రధాన రహదారిలోని బందరుకాలువలో గుర్రపుడెక్క పెద్ద ఎత్తున పేరుకుపోయింది. గుర్రపుడెక్క, తూటుకాడ బాగా అల్లుకుపోవటంతో కనుచూపుమేరలో కాలువ పచ్చగా కనిపిస్తోంది. కాలువలో నీటి ప్రవాహానికి గుర్రపుడెక్క తీవ్ర అడ్డంకిగా మారింది. ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువలో గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– తోట్లవల్లూరు